కథ




రచన :

డా॥ అర్చనా నాయక్

అనువాదం :

మహీధర రామశాస్త్రి

# చిరిగిన చీరకొంగు

పట్టుచీర కట్టుకుని, సామాన్యంగ అలంకరించుకుని మేడ మెట్లమీంచి దిగి వస్తూంది సురమ. గేటు బయట ఆమె కోసం నిరీక్షిస్తూన్న ఆమె భర్త అశోక్ పదే పదే పిలుస్తున్నా, చివరి మెట్టువద్ద ఆగిపోయిందామె. మెట్ల గదిలో బల్లమీద "బిలు" పడుకుని ఉంది. దాని ప్రక్కనే కూర్చున్న పని కుర్రాడు "మంటూ" – "బిలు" ఒడలంతా నిమురుతున్నాడు. డాక్టరు త్రిపాఠి బిలూకి సెలయిను ఎక్కించే యేర్పాట్లు చేస్తున్నారు. భీమకాయ అయిన అల్సేషియన్ గత కొద్దిరోజులుగా చిక్కి శల్యమయి భయంకరంగా తయారయింది.

"బిలు" సురమ అడుగుల సవ్వడిని పసిగట్టింది కానీ దాని నిస్తేజ శరీరంలో ఎటువంటి స్పందన లేదు. మామూలుగా అయితే తోక ఊపుతుంది. ఇప్పుడలాంటి సూచన లేదు. కానీ రెప్ప వేయకుండా రెండు కళ్ళను ఆమెపైనే నిలిపి ఉంచింది.

సురమ హృదయం ద్రవించిపోయింది. బిలూని ఆ స్థితిలో వదిలేసి వెళ్లడానికి ఆమె మనసు బొత్తిగా అంగీకరించడం లేదు. కాని తను వెళ్లక తప్పదు.

గేటు బయటనుంచి అశోక్‌బాబు మళ్ళీ పిలుస్తున్నాడు.

'అరె ! మంటూ ! అమ్మగారిని పిలు ! త్వరగా రావాలి ! టైమయిపోతూంది !'

మంటూ జవాబివ్వకుండానే, డాక్టరు త్రిపాఠి అన్నారు – 'మేడమ్ ! మీరు వెళ్ళండి. సెలయిను ఎక్కగానే అది లేచి కూర్చుంటుంది. మీరు తిరిగి ఎంతసేపటికి వస్తారు?'

'మూడు నాలుగు గంటలు పట్టచ్చు. త్రిపాఠి బాబూ ! బిలూని చిన్నప్పట్నుంచి చూస్తున్నది మీరేను. ఏంచేయాలో అంతా చెయ్యండి. కాని నా మాట మన్నించి నేను తిరిగి వచ్చేదాకా మీరిక్కడే ఉండండి. లేకుంటే నా మనసంతా యిక్కడే ఉంటుంది. ప్రశాంతంగాపోలేను' అంటూ యెంతో ఆదుర్దాగా చెప్పింది సురమ.

'అలాగే మేడమ్ ! మీరు వెళ్లండి.'

సురమ చివరిగా 'బిలూ'కేసి చూసింది. రెప్పవెయ్యకుండా 'బిలు' ఆమెనలా చూస్తూంది.

'అమ్మా ! నన్నొదిలి మీరు వెళ్లకండి. నేనింక బతకను !' అని చెబుతున్నట్టనిపించింది సురమకు.

ఆమె కాళ్లు ముందుకు సాగడం లేదు. బయటనుంచి అశోక్‌బాబు అరుస్తున్నాడు.

'అరె ! మంటూ ! అమ్మనడుగు వస్తుందో రాదో – నేను మళ్ళా మళ్ళా వెళ్ళలేను?'

సురమ వడివడిగా వచ్చి బయటనున్న కార్లో కూర్చుంది. అశోక్ కార్లో కూర్చొనే ఉన్నాడు అప్పటికీ. డ్రయివరు కారు స్టార్టు చేసాడు.

ఎవరూ పెదవి విప్పడం లేదు. ఇద్దరూ మౌనంగా కూర్చున్నారు. సురమ మనసు కకావికలమయి ఉంది. తానెక్కడికి వెడుతూందో, ఎందుకు వెడుతూందో అర్థం కావడం లేదు.పదే పదే 'బిలు' కళ్ళే ఆమెకు కనబడుతున్నాయి.

కొంత సేపటికి అశోక్ పెదవి విప్పి మాట్లాడేదు. 'బిలూని అల్లా వదిలేసి రావడం నాకు మాత్రం యిష్టమనుకుంటున్నావా? కానీ తప్పదు ! ఈ సభకు నువ్వు హాజరయి తీరాలి ! లేకపోతే దానినలా వదిలేస్తానా ? అదీకాక, గత పదిహేనురోజులుగా బిలూ అనారోగ్యంగా ఉంది. దాని చికిత్స విషయంలో మనం అశ్రద్ధ చెయ్యడం లేదు. ఈరోజు కూడా డాక్టరుని దాని దగ్గర ఉంచాం. మనం మరో మూడు గంటల్లో వెనక్కి వచ్చేస్తాం'.

అశోక్‌బాబు మాటలు సురమకి చెప్పాలని చెబుతున్నాడా లేక తనకు తాను నచ్చజెప్పుకుంటున్నాడో అర్థం కావడం లేదు. సురమ జవాబివ్వలేదు. ఈనాటి సన్మానసభకు తాను వెళ్ళి తీరాలి, తప్పించుకునే అవకాశం లేదు. గత ముప్పయి సంవత్సరాలుగా తను సాహిత్య సాధనలోఉంది. ఇన్ని సంవత్సరాల తర్వాత నవలాప్రక్రియలో తన సేవలను గుర్తించి రాజధానిలోని ఒకప్రసిద్ధ సాహిత్య సంస్థ తనకు సన్మానం ఏర్పాటు చేసింది. ఈరోజే కార్యక్రమం పడింది మరి.

ఆమె అక్కడకు వెళ్లకుండా ఎలా ఉండగలుగుతుంది. సాహిత్య సభలో తనకు భవ్య సన్మానం జరుగుతుందన్న కబురు తెలిశాక తనకన్నా ఎక్కువ సంతోషపడింది అశోక్‌బాబు. ఆమె రచనలకు మొదటి పాఠకుడు ఆయనే. మిగతా విషయాల్లో ఆమె లోపాలను ఎంచి తన విరక్తిని ప్రదర్శించినా, ఆమె రచనా వ్యాసంగంలో మాత్రం అస్సలు బాధించడు. పైగా ఏ రోజయినా తను ఒకవేళ టీవీ చూస్తూ ఎక్కువ సమయం గడుపుతూంటే అశోక్ అంటాడు – 'చూడు, పనీ పాటా లేని వాళ్ళు టీవీ. దగ్గర కూర్చున్నా ఫరవాలేదు. కానీ నీకు యింటి పనులయేక కొద్దిగా మిగిలే సమయాన్ని అనవసరంగా వ్యర్థపరచకు. రచన అన్నివేళలా సాగేది కాదు. అనుకోకుండా ఒకనాడు ఆగిపోతుంది. అప్పుడు ఎంత సమయం చిక్కినా లాభం ఉండదు !'

ఆయన గారిచ్చే ఉత్సాహము, ప్రోత్సాహము, సహకారము వల్లనే సురమ మంచి ప్రేరణ పొందుతూ రచనలు చేయగలుగుతూంది. ఆమె సన్మానం వార్త వచ్చినది మొదలు అశోక్ చిన్నపిల్లవాడిలా సంబరపడిపోతున్నాడు. అటువంటప్పుడు తను వెళ్ళకుండా ఉండలేదు కదా !

అరగంటలో ఆ యిద్దరూ రాజధానిలోని సూర్య మండపానికి చేరుకున్నారు. సురమను స్వాగతిస్తూ దగ్గరుండి లోపలకు తీసుకుని వెళ్లేందుకు ఎవరో ఒకరు బయట వేచి చూస్తూ వుంటారని అశోక్ ఆశించాడు. కాని అలాంటి జాడేం లేదక్కడ ! ఎవరో వస్తారని ఎదురు చూడకుండా ఆ యిద్దరూ హాల్లోకి ప్రవేశించారు. చాలా చిన్న హాలయినా జనంతో నిండి ఉంది. సురమకు ఏం చెయ్యాలో, ఎక్కడ కూర్చోవాలో అర్థం కాలేదు. తనను ఎదరకు వెళ్ళమని, అశోక్ సీటు వెతుక్కునే పనిలో పడ్డాడు.

సురమ జనాలను తప్పించుకుంటూ ఎదరకు వెళ్ళి ఓ కార్యకర్తలా కనుపిస్తున్న మనిషిని మొగమాటపడుతూ ప్రశ్నించింది.

'అయ్యా !ఈ రోజు సన్మానం అందుకునేవారు ఎక్కడ కూర్చున్నారు?'

ఆ మనిషి చిరాకు పడుతూ ప్రశ్నించాడు.

'మీకెందుకండీ – ఆ విషయాలు?'

చాలా యిబ్బందిగా మొహం పెట్టుకుని సురమ అంది: 'ఈరోజు నేనిక్కడ పురస్కారం తీసుకోవాల్సి ఉంది.'

'ఓ ! మీ పేరు ?'

'సురమ ప్రధాన్'

'దేనికోసం యిస్తున్నారు?

'నవల కోసం !'

'మీపేరు ఏ సంవత్సరం లిస్టులో ఉంది? ఇక్కడ మూడు సంవత్సరాల పురస్కార విజేతల లిస్టు ఉంది మరి...'

ఏ సంత్సరం లిస్టులో తన పేరుందో సురమకు గుర్తులేదు. ఆమె సందిగ్ధావస్థను గమనించిన ఆ వ్యక్తి తిరిగి అన్నాడు – 'సరే, మీరలా వెనకనుంచి వేదికమీదకు వెళ్ళి కూర్చోండి.'

అంతవరకూ సురమ వేదిక కేసి చూడనేలేదు. అక్కడ చూస్తే చాలామందే కూర్చునుండడం కనిపించింది. ముందు వరుసలో అలంకరించబడిన కుర్చీలు ఖాళీగా ఉన్నాయి. రావలసిన అతిథి, కార్యకర్తలు యింకా రాలేదు. సరే, వేదిక మీద అంతమంది యేం చేస్తున్నట్టు?


సురమ యాంత్రికంగా కదిలివెళ్ళి వేదికమీద ఓ మూల ఖాళీగా వున్న కుర్చీల్లో కూలబడింది. వేదికమీద నాలుగు మూలలా తెరలు కట్టి వుండడంతో గాలి తగలడం లేదు. పంకా గాలి ఎదర రెండు వరుసలకే పరిమితమవడంవల్ల వెనక వరస

వాళ్ళు ఉక్కి చచ్చిపోతున్నారు. భరించలేనంత వేడిగా ఉంది. కట్టుకున్న పట్టుచీర మరింత వేడెక్కిస్తూంది. మొహం తుడచుకుందుకు రుమాలు తెచ్చుకోలేదు తను. ఇంక చేసేది యేముంది?

తన ప్రక్కన కూర్చున్నవారిని సురమ గుర్తు పట్టలేకుండా ఉంది. దాదాపు ఓ పాతికమంది వేదికమీద కూర్చుని వాళ్లలో వాళ్ళు మాట్లాడు కుంటున్నారు. సురమ సామాన్య గృహిణి. ఇంట్లో నాలుగు గోడల మధ్యనే ఆమె జీవితం సాగుతుంది. ఆమె చాలా నవలలే వ్రాసింది. నవలాకారిణిగా తనపేరు జనాలకు పరిచితమయినదేను. కానీ తనను సాధారణంగా ఎవరికీ చూసే అవకాశం లేని మూలంగా తనను గుర్తించే సావకాశం లేదు. ఆమె మౌనంగా కూర్చుని ఉంది. అతిథిగా రావాల్సిన మంత్రిగారు ఆలశ్యం చేస్తుండడంతో అటు హాల్లోనూ యిటు వేదికమీద గొడవ గొడవగా ఉంది.

ఉన్నట్టుండి అంతా నిశ్శబ్దంగా మారి పోయింది సురమ పరధ్యానంలో పడింది.

## చినుకులు -ఏవిఎమ్




"అమ్మా ! నాకు తమ్ముడూ చెల్లాయి వద్దూ ! అన్నయ్య కావాలి !!"
"అన్నయ్య వేరే చోట వున్నాడులే ! తర్వాత నీకు పరిచయం చేస్తాలే !!"

✿ ✿ ✿

తన చెల్లెలు సుమిత్ర వాళ్ళు పదేళ్ళ క్రితం 'రాజాబగ్గీచా'లో ఉండేవారు. దాని కూతురు 'రూపాలి' పెళ్ళి చేసుకుని అమెరికా వెళ్లిపోయి, రెండు సంవత్సరాల తర్వాత అమెరికా నుంచి వచ్చిన సందర్భంలో సుమిత్ర తనను మధ్యాహ్న భోజనానికి పిలిచింది.

అశోక్‌బాబు ఊళ్ళో లేడు.పిల్లలు ఉద్యోగాలు పట్టుకుని బయటకు వెళ్ళిపోయేరు. సురమ రిక్షాలో సుమిత్ర యింటికి బయల్దేరింది. దూరం నుంచే సుమిత్ర యింటి గేటు దగ్గర జనం గుమిగూడి వుండడం చూసితను భయపడిపోయింది. ఏం జరిగి వుంటుంది? ఇంతమంది ఎందుకని గుమిగూడేరు దాని యింటిముందు అని సురమ ఉద్విగ్నురాల యింది. మనసంత వేగంగా రిక్షా పోలేదు కదా ! రిక్షాగేటు దగ్గరకు చేరగానే తను క్రిందకు ఉరికి గుంపును త్రోసుకుంటూ ఘటనా స్థలానికి చేరుకుంది.

అక్కడి దృశ్యాన్ని చూసిన సురమ నిశ్చేష్ఠ రాలయింది. తన చెల్లెలు వాళ్ళ ఆల్సేషియన్ కుక్క 'సింబా'గేటు బయట చచ్చి పడివుంది. విషయం అడిగితే తెలిసిందేమిటంటే – 'సింబా' పదిరోజుల క్రిందట మూడు పిల్లల్ని పెట్టిందట. ఆరోజు బయటి వాళ్ళు వచ్చి చూసి వెడుతూ గేటు వేయకుండా పోయేరు. తెరచి వున్న గేట్లోంచి ఓ ఆంబోతు లోపలకు రావడాన్ని చూసింది 'సింబా'. ఆంబోతు వలన తన పిల్లలకు, ప్రమాదమనుకున్న 'సింబా' ఆంబోతుని బయటకు తరుముకుంటూ రోడ్డుమీదకు వచ్చేసింది, అదే క్షణంలో వేగంగా పోతూన్న కారు క్రింద పడి చచ్చిపోయింది. సుమిత్ర యేడుస్తూంటే ఆమెను ఓదార్చి లోపలకు తీసుకుపోయింది తను.

సింబా చనిపోవడంతో సుమిత్ర యింట్లో అందరూ విచారంలో మునిగిపోయేరు. ఎవరూ అన్నాలు తినడం లేదు. సమస్య ఏమిటంటే యింకా కళ్ళయినా విప్పని ఆ మూడు పిల్లల్ని పెంచడం ఎలాగ అన్నది. అంత చిన్న పిల్లల్ని తీసుకుపోవడానికి ఎవరూ ముందుకు రారు. అయినా తను ఓ మగకుక్క పిల్లను యింటికి తీసుకు తెచ్చుకుంది. తేవడం అంటే తెచ్చింది కాని. దాని ఆలనా పాలనా చూడ్డం ఎంత కష్టమో ఆమె బొత్తిగా ఊహించలేదు. అంతకు ముందెన్నడూ తన యింట్లో కుక్కనో పిల్లినో పెంచిన అనుభవం లేదు. పిల్లలు కుక్కను పెంచుకుందామని పట్టుబట్టినపుడల్లా తను వాళ్ళకు లొంగలేదు. కారణం తనకు తెలుసు – పిల్లలిద్దరూ దానితో ఆడుకుంటారే తప్ప పొరబాటున కూడా దాని మలమూత్రాల విషయం పట్టించుకోరని ! అందుకనే తను వాళ్ళ కోరికను కొట్టిపారేసింది. కానీ ఆ రోజు తను అనుకోని ఘటన ఎదురవగానే ముందూ వెనకా ఆలోచించ కుండా జాలిపడి ఓ కుక్కపిల్లను తెచ్చి యింట్లో పెట్టింది. తీసుకొస్తూనే దానికి 'బిలూ' అని నామ కరణం చేసేసింది.

అప్పట్నుంచి 'బిలు' సేవ ప్రారంభం అయింది. డ్రాపరుతో లేకుంటే చెంచాతో పాలు త్రాగించడం, చక్కటి పక్క ఏర్పాటు చేయడం,దాని మలమూత్రాదులు శుభ్రం చేయడం యిలా సాగింది. అంతేనా, రాత్రంతా తల్లి దగ్గర లేక పిల్ల అరుస్తుంది కదా? దాని అరుపులకు అశోక్‌బాబుకి నిద్రా భంగమని, దాన్ని ఒడిలో పెట్టుకుని కూర్చోవడం ! దానికేదేనా అయితే 'బాదంబాడి' నుంచి రిక్షా చేసుకుని "బక్షీబజారు' పశువుల డాక్టరు దగ్గరకు పోవడం జరిగేది. మధ్య మధ్య అశోక్ చిరాకు పడుతూండేవాడు.

'చెల్లెలింటికి భోజనానికి వెళ్ళేవా? అక్కణ్నుంచి ఈ జంఝాటాన్ని నెత్తినేసుకుందుకు వెళ్ళేవా? ఇంతకన్నా మన చంటిపిల్లల్ని పెంచడం సులువు !'

చూస్తూండగా 'బిలు' పెరిగి పెద్దదయింది. అశోక్‌బాబు ఎంత విసుక్కున్నా అది ఆయన వెనకాలే ఎక్కువగా తిరిగేది. ఆయన ఎక్కడ కూర్చుంటే అక్కడ 'బిలు' ఉండేది. ఆయన లేవగానే కూడా వెంబ డించేది. ఇదంతా చూసిన సురమ నవ్వుకునేది. పశువు అయినా దానికెన్ని తెలివి తేటలో ! దానికి అర్థం అయిపోయింది. ఈ యింట్లో అమ్మను కాకాపట్టనవసరం లేదు. అయ్యగారి మనసును దోచుకుంటే చాలునని ! అశోక్‌బాబు సాయంకాలం వీధిలో తిరిగి యేడు గంటలకు ముందే యింటికి చేరతాడు. ఆయన రావడం కాస్తంత ఆలశ్యం అయితే చాలు – బిలూ అరిచి అరిచి యిక యింట్లో ఎవరినీ నిలబడనిచ్చేది కాదు ! సురమ ఎన్ని తిట్టినా దాని గోల దానిదేను. అశోక్ వచ్చేదాకా అలా అరుస్తూ ఉంటుంది !

సురమ ఒంటరిగా దానిసేవ చేయలేక, పల్లెటూరులో తనకు తెలిసిన 'మంటూ' అన్న కుర్రాణ్ణి తెచ్చుకుని యింట్లో పెట్టుకుంది. మంచి కుటుంబమే వాళ్ళది. వస్తూనే యింటిపనినంతా చక్కపెట్టేశాడు. సురమకి కాస్తంత ఊరట కలిగింది. ముఖ్యంగా 'బిలూ'కి తిండిపెట్టడం, స్నానం చేయించడం, రోజూ రెండు సార్లు దాన్ని బయట తిప్పడం వంటి తిప్పలు తప్పాయి తనకు. 'బిలూ' కూడా పూర్తిగా 'మంటూ'కి అలవాటయింది. ఇక దాని సంగతులన్నీ వాడే

చూసుకుంటున్నాడు. కానీ ఏ కారణం చేతనయినా సురమ కానీ అశోక్ బాబు కానీ 'మంటూ'మీద కోపంతో కేకలేస్తే బిలు ఎక్కణ్ణుంచో పరిగెత్తుకు వచ్చి వాడిమీద మొరుగుతుంది. మంటూ అమ్మగారిని అయ్యగారినీ యేమీ అనలేక, 'బిలూ'ని కేకలేస్తాడు. వాళ్ళ యిద్దరి అరుపులతో కొంప హోరెత్తుతుంది. మంటు మీద కోప్పడిన విషయాన్ని మరిచిపోయి, సురమ ఆ యిద్దరినీ శాంతింపజేస్తుంది.

పిల్లలిద్దరూ 'బిలూ' గురించి తల్లి చెప్పే కబుర్లు విని విని విసిగిపోయేరు. చిన్నప్పుడు వాళ్ళు యింటి పట్టున వుండే రోజుల్లో ఓ కుక్కపిల్లను పెంచుకుందాం అంటూ ఎంతగానో అడిగేవారు. కానీ ఆమె వాళ్ళ మాట పెడచెవిని పెట్టింది. ఇవాళ వాళ్ళకి 'బిలూ' గురించిన ఉత్సాహం ఎందుకుంటుంది? వాళ్ళు పెద్దవాళ్ళయి పోయేరు. తల్లి కబుర్లు వినే స్థితిలో లేరు. ఆ సంగతి సురమకీ తెలుసు. పిల్లలు అడిగితే తప్ప వాళ్ళ దగ్గర 'బిలూ' సంగతులు ఎత్తదు.

'బిలూ'కి కూడా వయసొచ్చింది. దానికి తోడు కావాల్సి ఉంది. ఆ యేర్పాట్లు కూడా సురమ చేయాల్సిందే. తనకు తెలునున్న స్నేహితురాలి యింట్లో 'బిలూ'కి తగిన తోడుందని తెలుసుకుంది. ఆ యిద్దరూ కూడబలుక్కుని ఆ రెండింటినీ కలిపి చూసేరు. కానీ 'బిలూ' ఆడ కుక్కను చూసి భయపడి పారిపోయి మంచం క్రింద దూరి పడుకుంది. సురమ యింక 'బిలూ'కి జత కట్టడం సంగతిని పూర్తిగా విరమించుకుంది. 'బిలూ' ఆ జన్మ బ్రహ్మచారిగా మిగిలి పోయింది. మంటూ నాలుగురోజుల కోసం పొరుగూరు వెడితే వీధి గుమ్మం కేసి చూస్తూ కంటనీరు పెట్టుకునేది. దాని భయంకర రూపాన్ని చూసి యింటికి వచ్చేవారు భయపడేవారు. కానీ యింటికి వచ్చిన వాళ్ళని యేమీ చేసేది కాదు. పైగా బాగా తెలుసున్న వాళ్ళతో వ్యవహరించినట్లు తోక ఊపుతూ దగ్గరగా వచ్చేది. కళ్ళప్పగించి వాళ్ళనే చూస్తూ వాళ్ళ కబుర్లు వినేది.'

దాని పది సంవత్సరాల జీవితంలో ఎవరినీ కరచి ఎరగదు. కాని సురమని చూస్తే చాలు పరిగెత్తు కుంటూ వచ్చి ఆమె పమిటకొంగును నోటితో పట్టి లాగుతూ వినోదిస్తుంది. అలాంటి క్షణాల్లో చాలా దెబ్బలే తినేది. చాలా చీరల్ని చింపింది కూడ !

గత పది పదిహేను రోజులుగా 'బిలూ' హఠాత్తుగా తిండి తినడం మానేసింది. సురమ, మంటు ఆటోలో 'బిలూ'ని ఎక్కించుకుని పశువుల డాక్టరు త్రిపాఠి చుట్టూ తిరిగారు. 'బిలూ'ని చిన్నప్పట్నుంచీ చూస్తున్న డాక్టరాయన. కానీ ఈసారి ఎందుకనో ఆయన మందు పట్టివ్వలేదు. క్రమంగా 'బిలూ' చిక్కిపోసాగింది.

సురమ వాళ్ల యింట్లో విచార ఛాయలు క్రమ్ముకున్నాయి. ఎవరికీ నిద్రాహారాలు ఉండడం లేదు. సురమ ఉభయ సంధ్యల దేవుడి దగ్గర 'బిలూ' పేర నేతిదీపం వెలిగించి దండాలు పెడుతూంది. రకరకాల మొక్కులు మొక్కుతూంది. ఎన్ని చేసినా మనసు కీడునే శంకిస్తూంది. మనసుకు ఎంత సర్ది చెప్పుకుంటున్నా, యింట్లో అందరికీ తెలుసు యింక 'బిలూ' బతికే ఆశ లేదని !

ఉన్నట్టుండి సురమ చెవులకు యిలా వినబడింది –

"అమ్మా ! నన్ను వదిలిపెట్టి వెళ్ళిపోయావు. నేనింక బ్రతకనని నీకు తెలీదా ? నన్నిలాంటి అవస్థలో వదిలేసి వెళ్ళిపోవాల్సినంత పనేం వచ్చింది నీకు? నా తల్లిఎవరో నేనెరగను. కన్ను తెరిచింది మొదలు నాకు తెలిసిన విషయం నేను నీ ఒడిలోనే పెరిగానని. నిన్నే నా తల్లిగా గుర్తించాను. ఎంతో ఓర్మితో నువ్వు నా నోట్లో చెంచాతో కొద్ది కొద్దిగా పాలు పోసేవు. రాత్రనక పగలనక సేవచేసి నన్ను బతికించావు. ఈనాటి వరకూ నువ్వే నా తల్లివని అనుకున్నాను. ఈనా చరమావస్థలో నీకోసం ఎంత పరితపించి పోతున్నానో చూడు ! ఇదే నీ కన్న సంతానమయితే యిలా వదిలేసి పోదువా? నీ కొడుకు 'మిరు'కి కాస్తంత జ్వరం తగిలిందని, నీ చెల్లెలి కూతురు పెళ్ళికి కూడా వెళ్ళడం మానుకున్నావు. మరి యివాళ ఏమయింది? కేవలం జాలితోనేనన్ను పెంచావా? నిన్ను చూడాలని నా కళ్ళు పీకుతున్నాయి; ప్రాణం గిలగిల్లాడుతూంది; కానీ....'

సురమ ఉబికి వస్తున్న కంఠంతో అంది :

'బిలూ... కొంచెం వేచి చూడు.. నా తండ్రి కదూ...'

తిరిగి ఆమె చెవులకు యిలా వినబడింది – –

'మృత్యువు ఎవరికోసమయినా వేచి చూస్తుందా తల్లీ ? నీకు అన్ని పురాణ శాస్త్రాలు తెలుసు; మరెందుకు వెర్రిమాటలు?'

✿ ✿ ✿

సురమ పేరును పదే పదే పిలుస్తున్నారు సభవారు. హఠాత్తుగా తెలివి తెచ్చుకున్న సురమ యాంత్రికంగా వేదిక ముందు భాగానికి నడిచింది. ఆమె చేతిలో ఓ కాగితం, జ్ఞాపిక పెట్టి, అతిథిగా వచ్చినాయన ఎవరో తన భుజాలమీంచి శాలువాను కప్పేడు. కళ్ళవెంబడి కారుతున్న కన్నీటి ధారలను అదుపులో వుంచుకోలేకపోయింది సురమ. చూసినవారు విస్తుపోయేరు. రచయిత్రి ఓ కాగితం ముక్కకి, శాలువాకే యింత ఆనంద పడిపోతున్నారా అని ! తన బాధ వాళ్ళకేం తెలుసు!

ఇంటికి తిరిగి వెడుతున్నంత సేపూ దారిలో దంపతులు మౌనంగానే ఉన్నారు, 'బిల్లూ'ని తలుచు కుంటూ ! ఇంటికి వెళ్ళేసరికి దాని అవస్థ యెలా ఉంటుందోననుకుంటూ మౌనంగా ఉండిపోయారు. మంటూ ఫోన్ చేసి ఉండాల్సింది ! తమకు ధైర్యం చాలక ఫోన్ చెయ్యలేకపోయేరు.

ఇంటికి చేరి చూస్తే గేటుదగ్గర డాక్టరుగారి స్కూటరు లేదు. 'బిలూ' మామూలు స్థితికి చేరుకుని ఉంటుంది. డాక్టరుగారు యింటికి వెళ్ళి ఉంటారు అనుకుంది సురమ.

సురమ హడావుడిగా మెట్ల దగ్గరకు వెడుతూంటే మంటూ ఎదురయి చెప్పాడు –

"అమ్మా ! ఓ గంట క్రితమే 'బిలూ' చనిపోయింది. అనేకసార్లు ఫోను చేసినా మీ మొబయిలు స్విచ్ ఆఫ్ చేసి ఉంది. చివరి సారిగా తల పైకెత్తి మీకోసం తెగ వెతికింది. చాలా యేడ్చింది. నాకో ఆలోచన వచ్చింది. బాగా చింపేసిన మీ చీరను కోపంతో మీరు దాని మీదకు విసిరేశారు ఒకనాడు. ఆ చీరను తెచ్చి దాని తలక్రింద పెట్టాను. చీర కొంగును తీసి దానిమీద కప్పేను. దాంతో మౌనం దాల్చింది. చీరమీద తల పెట్టుకుని అలాగే నిద్రపోయింది, మరి లేవలేదు ! అప్పుడు డాక్టరుగారు అన్నారు – 'ఇంక చేసేది యేమీ లేదు !'

సెలయిను తీసేసి ఆయన యింటికి వెళ్ళిపోయారు.

సురమ శిలలా బిగుసుకుపోయింది. 'బిలూ' రెండు కళ్ళు నిలువు గుడ్లు పడి తననే చూస్తున్నాయా అన్నట్టుగా ఉండిపోయేయి. చేత్తో పట్టుకున్న సన్మాన పత్రాన్ని జ్ఞాపికను, శాలువాను విసిరేసి లోపలకు పరుగెత్తింది సురమ. 'బిలూ' తలను ఒడిలోకి తీసుకుని వెక్కి వెక్కి యేడ్చింది. అస్పష్టంగా ఆమె బెక్కుతూ అన్న మాటలు బయటపడ్డాయి.

'నన్ను క్షమించరా నాన్నా ! అర్థం లేని ఓ సన్మాన పత్రానికి ఆశపడి, నిన్ను చివరి క్షణాల్లో దిక్కులేని దాన్ని చేసి వెళ్ళిపోయాను. పాపిష్ఠిదాన్ని!'

అశోక్ కట్టలు తెంచుకుని వస్తున్న దుఃఖాన్ని ఆపుకునే ప్రయత్నం చెయ్యలేదు. వలవల యేడ్చేశాడు.

మంటు నేలమీద కూర్చుని చిరిగిన చీర కొంగులో 'బిలూ'ని చుట్టబెడుతున్నాడు !